

# అనగనగా ఓ మంచి కథ

## మీ పేరేమిటి?

- గురజాడ అప్పారావు

(రచనా కాలం ౧౯౧౦)

తెలుగు కథ శతవార్షికోత్సవం సందర్భంగా ‘కౌముది‘ పాఠకులకి వందేళ్ళ క్రిందటి కథ ప్రత్యేకంగా అందిస్తున్నాం.

*గురజాడ అప్పారావు గారు తన మొదటి కథ ‘దిద్దుబాటు‘ వ్రాసిన సంవత్సరం 1910 లోనే వ్రాసిన రెండోకథ ఇది. వందేళ్ళ క్రిందటే అప్పారావు గారు చాటి చెప్పిన అభ్యుదయభావాలూ, మత సామరస్యత మాత్రమే కాక వందేళ్ళ క్రిందటి అందమైన తెలుగు భాషా నుడికారానికి కూడా ఈ కథ చక్కటి నిదర్శనం. గత వందేళ్ళ లోనూ ఇదే కథా వస్తువుని వందలాది మంది రచయితలు కొన్ని వందల సార్లు మళ్ళీ మళ్ళీ చెప్పారు. ఐనా వందేళ్ళ క్రిందటి ఈ కథ ఇప్పటికీ మెరుగు తగ్గని బంగారం..!*



దేవుడు చేసిన మనుషుల్లారా!

మనుషులు చేసిన దేవుళ్ళారా! మీ పేరేమిటి?

పురాణములను గురించి మేము శంకలు వేస్తే, మా గురువుగారు ‘వెధవ చదువు! మీ మతులు పోతున్నాయి. మీరు ఒట్టి బౌద్ధులు‘ అనేవారు.

‘బౌద్ధులు ఎటువంటి వారు శాస్త్రులుగారూ!?‘ అని రామ్మూర్తి అడిగాడు. రామ్మూర్తి శత పెంకె.

‘రేపు ఆదివారం నాడు పువ్వుల తోటలో ఉపన్యాసం ఇస్తాను. అంతా రండి‘ అని శాస్త్రులుగారు శలవిచ్చారు.

ఆదివారం మధ్యాహ్నం నాలుగు గంటలప్పుడు పువ్వుల తోటలో ఒక పరువు మావిడి చెట్టు కింద ఇసకలో మేమంతా పాతికమంది కూచున్నాం. మధ్య గావంచా పరుచుకుని, మాకు అభిముఖంగా శాస్త్రులుగారు కూచున్నారు. నేను బల్ల చెక్క తెచ్చి వెయ్యబోతే ‘ఒద్దురా, మీరంతా కింద కూచుంటే నేను బల్లమీద కూచుంటానా!‘ అన్నారు. రెండు కొబ్బరికాయల నీళ్ళు తాగి, తాంబూలము వేస్తూ శాస్త్రులుగారు బౌద్ధమతం విషయమై ఉపన్యాసం ఉపక్రమించారు. పదినిమిషములు అయ్యేసరికి, రామ్మూర్తి తన చేతనున్న పుస్తకం విప్పి చూచి, ‘శాస్త్రులు గారూ, తాము శలవిస్తున్నదంతా సర్వదర్శన సంగ్రహములోనిది కాదండి‘ అని అడిగాడు. ఆశ్చర్యపడి శాస్త్రులుగారు, ‘ఔరా! నీకెలా తెలిసెనురా! అదేం తర్జుమా కాదు గద?‘ అన్నారు.

'ఔనండి.'

'ఈ ఇంగిలీషు వాడు ఉద్దండ పిండమ్రా! ఆ రెండో పుస్తకమేమిటో?'

'బుద్ధ చరిత్రండి.'

'ఎక్కడ సంపాదిస్తార్రా ఈ అపూర్వ గ్రంధాలు, ఏదీ తే'

శాస్త్రులుగారు పుస్తకం అందుకుని, అతి మధురమైన కంఠంతో చదివి, అర్ధం చెప్పడం ప్రారంభించారు.

నాలుగు రోజులు పోయిన తరువాత, శాస్త్రులుగారు క్లాసులో ఇలా శలవిచ్చారు. 'ఒరే ఈ పుస్తకం చదివిందాకా బుద్ధుడి మహిమ నాకు తెలియలేదురా. తప్పకుండా ఈ మహానుభావుడు శ్రీ మహావిష్ణు అవతారమ్రేనా'

ఆనాటి నుంచీ శాస్త్రులుగారు మమ్మల్ని బౌద్ధులని దూషించడం మానేశారు. కిరస్తానులమై మట్టుకు అంటూ వచ్చారు. క్రీస్తును, శ్రీ మహావిష్ణువు యొక్క పదకొండవ అవతారంగా చేయడానికి సాధ్యంకాక ఒడంబడి ఊరుకున్నాం.

మా గురువుగారి వంటి గురువులు లోకంలో లేరు. చిరకాలం కాశీవాసం చేసి తర్కశాస్త్రం చదువుకున్నారు. మన దేశంలో అంగ్ల తార్కికుడు లేడని ప్రతీతి, శాస్త్రం మాటకేంగానీ, కావ్యాల్లో మంచి రసగ్రాహి, మరి సుగుణ సంపత్తికో అంటే, సత్యకాలపు మనిషి అన్నప్పుడు ఆయన సత్యకాలం మనిషి. అంత పాండిత్యం యింత సత్యకాలం ఒక్క బుజ్జిలో యెలా యిమిడి వున్నాయో, ఆశ్చర్యం?

ఈ జరిగినది పది సంవత్సరముల కిందటి మాట. ఇప్పుడు శాస్త్రులుగారు ఫించను పుచ్చుకున్నారు. మాలాంటి శిష్యుల శుశ్రూష పొందుతూ, మాకు సంస్కృత గ్రంధాలు చెపుతూ, సంతోషిస్తూ, సంతోష పెడుతూ, కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

నేను వర్తకం చేస్తున్నాను. రామ్మూర్తికి భూములు లావుగా ఉన్నాయి. కొత్త కొత్త మోస్తర్లను వ్యవసాయం చేస్తున్నాడు. పూట గెడ్డ దరిని సీతారామ కోరుతున్న (?) ఒక బ్రహ్మాండమైన తోట వేశాడు. అవి పువ్వులు కావు. తొలి ఫలాలు గురువు గారు ఆరగించనిదీ రామ్మూర్తి చెట్టు ముట్టడు. ఆ తోటలో విహరించడం గురువుగారికి అత్యానందం. అక్కడనే మేం తరచు మీటింగులు చేస్తూ ఉంటాం. వెంకయ్య స్కూలులో మేష్టరు. ఖాయదా లావు చేసి, తిట్లు తింటూ ఉంటాడు. మా స్కూలు జట్టులో ఆరేడుగురం ఇక్కడనే ఉన్నాం. గురువుగారూ మేమూ కలిసినప్పుడల్లా స్వర్గ ఖండం ఒకటి అక్కడికి దిగినట్లు ఉంటుంది

<u>ఇక ప్రస్తుత కథ</u>

మా పట్నానికి ఎనిమిది మైళ్ళ దూరంలో రామగిరి అని ఒక విష్ణుక్షేత్రం కలదు. దాని వర్ణన మరి ఒక మాటు చేస్తాను, ఇప్పటి మట్టుకు మీకు తెలియవలసినదేమంటే - అక్కడి విష్ణుక్షేత్రం ఆధునికం. ఆ ఊరి నల్లకొండలనంతటను శిధిలమైన బౌద్ధ కట్టడములు కలవు. అక్కడివారు వాటిని పాండవుల పంచలంటారు. ఈ దేశంలో పాండవులు ఉండని గుహలూ, సీతమ్మవారు స్నానమాడని గుంటలూ లేవు.

ఒక పెద్ద గుహలో నున్న బౌద్ధ విగ్రహమును శివుడని, దాని పక్కనున్న దేవీ విగ్రహమును గౌరి అని భావించి జంగాలు పూజ చేస్తున్నారు.

ఉండగా, ఉండగా, కొన్నాళ్ళకి, ఒక దొర, గుమాస్తాలతోను, బిళ్ళ బంట్రోతులతోను వచ్చి, మెట్టల పడమట నున్న ముదర మామిడి తోటలో కాంపు ఖణాయించాడు. మరిన్ని వందల కొలది కూలీలను కూర్చి ఆ కొండల మధ్యనున్న దిబ్బలు తవ్వించడం ఆరంభించాడు. ధనం కోసం తవ్వుతున్నాడని అక్కడి వాళ్ళంతా అనుకున్నారు. కాని, విరిగిన ప్రతిమలూ, జిలుగు చెక్కిన రాళ్ళూ, పాతుకుపోయిన పాత కుండలూ, మండలూ బళ్ళమీద పెరికి ధనం కంటెనూ ఎక్కువ భద్రంగా ఏర్చి పేర్చాడు. ఇవి చూచుటకే మేం వెళ్ళాం.

మేం ఆ ఊరు వెళ్ళే సరికి జంగాలు పూజ చేసే పాలరాతి బుద్ధ ప్రతిమ గూర్చి ఊరంతా కోలాహలంగా ఉండెను. ఆ బొమ్మ మేం చూశాం. బహు సొగసైనది. ఇంత తీరైన చిత్రం గాంధార దేశం వైపు తప్ప మరెక్కడా చూడలేదని దొర మాతో చెప్పారు. దాని పీఠం మీద 'హే ధర్మా హేతు ప్రభవా' ఇత్యాది బౌద్ధ సిద్ధాంతము సొంపుగా వ్రాయబడి యున్నది. దొరగారు దానిమీద కన్నువేసి 'ఇస్తారా?' అని అడగగా, శైవులలో పెద్దలు 'ప్రాణములయినా యిత్తుము గాని దానిని యివ్వజాలము' అనిరి. దొరగారు నలుగురితో సాయిలా పాయిలాగా తిరిగేవారు గనుక మర్యాదగా జవాబు చెప్పారు. మరొకరైతే కథ చాలా దూరం వెళ్ళి ఉండును. దొరగారు అంతటితో ఆ ప్రయత్నం మానుకున్నారు.

ఇలా ఉండగా ఒకనాటి రాత్రి పూజ చేసే జంగం శరభయ్య ఆ ప్రతిమను పెగిల్చి, కొనిపోయి దొరగారికి రెండూ వందలకి అమ్మజూపాడు. దొంగతనంగా తెస్తివని పుచ్చుకోజాలను అని, దొర తనకు మాట రాకుండా ఉండగలందుకు ఊరి పెద్దలకు కబురు పెట్టాడు. ఏమిటీ, ఈ దొర బుద్ధి తక్కువా అని శరభయ్య కొంత ఆశ్చర్యపడి, దొర కొంచెం కనుచాటు కాగానే, మెట్టలవైపు పరుగుచ్చుకున్నాడు. నాటికీ నేటికీ మరి పికరు లేదు.

శాయన్న భుక్త గారి ఇంట బస చేసి ఆ ఊళ్ళో మేం మూడురోజులు ఉన్నాం. శాయన్న భుక్త మా గురువుగారి దగ్గర కొన్నాళ్ళు తర్కం చదువుకున్నాడు. మంచి సాహిత్యం కద్దు. కొంచెం కవిత్వం కూడా అల్లుతాడు.

మూడోనాడు రాత్రి భోజనం చేసుకుని డాబా మీద నలుగురం కూచున్నాం. చిన్న గాలి రేగి తోటలో కొబ్బరి మట్టలు అల్లాడడం ఆరంభించాయి. ఎదుట దేవుడి కొండ బ్రహ్మాండమైన మహాలింగము వలె చీకటిని చీల్చుకుని మిన్నుముట్టి మనిషి యొక్క అత్యల్పతను సూచించుచు, ఏదో చెప్పరాని చింతను భీతిని మనస్సులకు కలుగ జేయుచుండెను. దేవతలు పూజ చేసిన దివ్య కుసుమముల వలె చుక్కలు శిఖరము చుట్టు చెదిరి వెలిగెను. మా మనస్సులు గత కాలము నాటి స్థితిగతులను గూర్చిన ఊహలతో నిండియుండెను. తలపోసి తలపోసి ఆనాడు ఈ స్థలం ఎలా ఉండెనో బౌద్ధులు ఏమి ఏమి చేసేవారో అని నేనంటిని.

"ఆ పీనుగులు మనలాగే ఏడుస్తూ ఉండేవారు. మనకంటే అధ్వానంగా ఉండేవారు" అని సున్నితమైన తలంపులు బెదిరి చెదిరే పెళుసు గొంతుకతో వెంకయ్య అరిచాడు. నాకు కళ్ళ మొయా కోపం వచ్చి 'నీ అమూల్యమైన ఊహలతో నువ్వు ఆనందించరాదా, నా తలలో నే కల్పించుకున్న బౌద్ధ ప్రపంచము పెటుకు మాటలాడి ఏల కలత పరిచెదవు' అని అడిగాను.

'గాని' శాస్త్రులుగారు అన్నారు. 'బుద్ధుడు విష్ణ్వవతారం కదా ఈ జంగాలు శివుడని ఏల పూజ చేస్తున్నారా?' అని శంక వేశారు.

శాయన భుక్త పొడుం డబ్బీ తీసి, పెద్ద పట్టు పీల్చి, గావంచాతో ముక్కు తుడుచుకుని 'ఒక కథ ఉంది' అన్నాడు. కథంటే శాస్త్రులుగారికి సరదా. 'అయితే చెప్పు' అనారు. చెవి నొగ్గి విన్నాం. ఇదీ కథ.

ఈ గ్రామంలో శైవ వైష్ణవ మతాలకు వైరం చిరకాలం నుంచి కద్దు. శివమతానికి మొనగాడు జంగం శరభయ్య అనగా ఇప్పుడు పారిపోయిన పూజారే. మొన్న ప్రతిమను పెరికి పలాయనం అయిందాకా అతగాడు సాక్షాత్తూ నందికేశ్వరుడి అవతారమని రాత్రులు గృహాయెదుట వృషభ రూపమైౕ మేస్తూ ఉంటుందని ఇక్కడి జంగాలకూ, దేవాంగులకూ నమ్మకం. ఇపుడైనా ఆ దొర కిందటి జన్మలో పరమ మహేశ్వరుడౌటచేత ఆ విగ్రహమును కోరినవాడనీ, భక్తవాత్సల్యం చేత శివుడిచ్చిన శలవులను అనుసరించే శరభయ విగ్రహాన్ని పెరుక్కు వెళ్ళాడనీ డేరా నుంచి పారిపోవడంతో వృషభ రూపం ధరించి రంకె వేసి మరీ దాటేశాడనిన్నీ ఒక వార్త అప్పుడే అతని శిష్యులు పుట్టించారు. రేపో నేడో వీరాసనం వేసుకుని బక ధ్యానం చేస్తూ కొండమీదనో, గోపురము మీదనో ఆవిర్భవిస్తాడు. బాజా భజంత్రీలతో వెళ్ళి ఉల్లభంబట్టి తోడ్కుకు వస్తారు. ఆపైని కంసాలి వీరయ (వీరణాచారి అని పిలిస్తేనేగానీ కోపగిస్తాడు) ఆ కథకు చిలువలూ పలువలూ కల్పించి ద్విపద కావ్యం రచించి అచ్చు వేస్తాడు ఆ ఉభయుల కీర్తి దిగ్దంతులకు వెల్ల వేస్తుంది.

'ఔరా వీళ్ళ మూఢ భక్తి! ఈ ప్రపత్తి పండితులకు ఉండదురా, వీళ్ళది ఏమి అదృష్టం' అని గురువుగారు అన్నారు. ఆ పైని వెంకయ్య ఏమో అనబోతే చేతితో నోరు అడ్డాను. ఎవరి అభిప్రాయం వారు చెప్పకుండా నీ శాసనం ఏమిటి అని అడిగాడు. మాటాడవద్దని చై సౌజ్ఞ చేశాను. శాయన్న భుక్త తిరిగి ఎత్తుబడి చేశారు.

'అవును, తాము శెలవిచ్చినట్లు పామరులకు ఉండే గాఢ భక్తి పండితులకు ఉండదుగాని ఈ మూఢభక్తి ఒకప్పుడు ప్రాణాంతం తెస్తుంది. అదే చెప్పబోవుచున్నాను వినండి.'

'నేనూ ఆ మాటే చెప్పబోతే చెప్పనిచ్చాడు కాడు' అని వెంకయ్య అన్నాడు. 'అవును నీకంటూ తెలియని సంగతి లేదు మరి ఊరుకో' అన్నాను.

శివ స్థలం యొక ఉత్పత్తి మీకు తెలియనే తెలుసును. పూజారి శరభయ్య చాలా కథకుడౌటచేతను, వీడి రోజుల్లో శివ స్థలానికి మిక్కిలిగా వైభవం కలిగింది. చుట్టుపట్ల గ్రామాల వాళ్ళందరూ మొక్కుబళ్ళు చెల్లిస్తారు. ఉత్సవు రోజులలో పెద్ద జాతర్లు సాగుతాయి. మరిన్నీ ఇక్కడ దేవాంగులు కలిగిన వాళ్ళు జంగంపాడు యావత్తున్నూ, దేవర పేటానున్నూ శరభయ్య మాట మీద నడుస్తారు. ఈ గ్రామంలో ఉండే విష్ణుస్థలం రెండు వందల ఏళ్ళ కిందట ఈ దేశం ఏలే ఒక మహారాజు కట్టించి రాగభోగాలకు ఒక గ్రామం స్వామికి సమర్పణ చేశారు. అప్పటి నుంచి రంగాచార్యులు గారి కుటుంబస్థులే ఈ స్థలానికి ధర్మకర్తలై ఉంటూ వచ్చారు. ఈయన ఇద్దరు ముగ్గురు వైష్ణవులను జీతమిచ్చి ఉంచి వాళ్ళచేత మిక్కిలి భక్తిశ్రద్ధలతో స్వామివారి కైంకర్య జరిపిస్తున్నారు. రంగాచార్యులు గారు బహు యోగ్యులు. ఆయన యొక సంస్కృత సాహిత్యం మీరు చూడనే చూశారు. ద్రావిడ వేదములోకూడా గట్టివారని ప్రతీతి కద్దు. ఆయన కొమాళ్ళు క్రిష్ణమాచార్యులు కూడా సంస్కారే గాని విశేష ప్రయోజకుడు కాడు. ఆ ఇంటికి వెలుగు తెచ్చినది ఈ కృష్ణమాచార్యులు భార్య నాంచారమ్మ. ఆమె తల్లీ తండ్రీ కూడా పండితులౌటచేత ఆంధ్ర గీర్వాణముల యందు మంచి జ్ఞానం సంపాదించిరి. పురాణం ఆ ఇల్లాలు చదివినంత శ్రావ్యంగానూ, రసంతోనూ ఎవరూ చదవజాలరు. రూపమూ రూపానికి సదృశ్యమైన గుణసంపత్తి కలదు. ఆమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడున్నూ, ఇల్లూ, దేవాలయం కూడా ఆమే చక్కబెట్టుకుంటారు.

'ఇది కవిత్వమా, నిజమా?' అని వెంకయ్య అడిగాడు.

'మాకూ వాళ్ళకూ రాకపోకలు గలవు నా భార్య చెప్పిన మాటలు నే చెపుతున్నాను. ఆమె పురాణం చదవడం చెవులారా విన్నాను. మీకూ వినడపు అభిలాష ఉంటే రేపటి దాకా ఉండిపొండి. విష్ణుస్థలం యొక్క స్థితి ఇది. కాని, అయవార్లం గారు మత సంబంధమైన జట్టీలలో ఎన్నడూ జోక్యం కలగజేసుకోవడం లేదు. వైష్ణవ పక్షానికి కెప్తాను సాతాని మనవాళ్ళయ్య. అనగా రోజూ పొద్దున్న ఉపాదానాకు వచ్చి, స్తోత్ర పాఠాలతో పెణక ఎగరగొట్టేస్తాడే, అతగాడే ఒకనాడు తెల్లవారుగట్ల కలక్టర్లగారు గుఱ్ఱమెక్కి వస్తూ ఉండగా, గ్రామ పొలిమేరలను మనవాళ్ళయ్య ఎదురై, పెళ ఫెళమని శ్లోక ఎత్తుబడి చేసే సరికి, ఇతని స్థూలకాయం, బట్టె నామాలు, రాగి ధ్వజం, కోలాహలమూ చూసి గుఱ్ఱం బెదిరింది. కోపం వచ్చి కలక్టరు అయిదు రూపాయలు జుల్మానా వేశారట. ఈ కథ శుద్ధ అబద్ధం అనీ, తన చేత శ్లోకాలు చదివించి దొరగారు ఐదు రూపాయలు ప్రెజంటిచ్చారని, అవి పెట్టి కొత్త వ్యాయపార పాత్ర కొన్నానని మనవాళ్ళయ్య చెబుతాడు

## 2

శైలవులలో ఉన్న ఐకమత్యం వైష్ణవుల్లో లేదు. సాతాన్లు చాలా మంది మనవాళ్ళయ్య శిష్యులే. అయినప్పటికీ కొందరు మట్టుకు అతను అవతారపురుషుడని చెప్పరు. అతనంటాడు. 'శరభయ్యే వృషభావతారమైనప్పుడు నేను గరుడాళ్వారి పూర్ణావతారం కాకపోతే కాకపోవచ్చును గాని వారి యొక్క అత్యల్పాంశ వల్లనైనా జనించి ఉండకూడదా. గరుడాళ్వారి నఖములయొక్క తేజస్సు నా యందు ఆవిర్భవించి ఉన్నది కాబట్టే, శరభయ్యను ఇలా చీల్చి పేల్చుతున్నాను.'

అయ్యవార్లంగారికి ఒక మాటు ఈ మాట చెవి సోకి గట్టి చీవాట్లు పెట్టారు. ఆ చీవాట్లు తిని పైకి వచ్చి, 'ఈ బ్రాహ్మణులదీ, జ్ఞానమూ కాదు. అజ్ఞానమూ కాదు. కడజాతి మనుష్యులే భక్తి ప్రభావం చేత ఆళ్వారులై ఉండిరి కదా? ఇంతకాలవాఁయి రాముడి ధ్వజమును జయప్రదంగా మోస్తూ శైవ సంహారం చేసిన నేను శ్రీ మద్గరుడాళ్వారి నఖాగ్రాగ్రం యొక్క అవతారం ఏల కాను? గరుడాళ్వారి నఖములు పెరిగి, ఖండన ఐనప్పుడూ ఆ ముక్కలు నా వంటి భక్తులుగా ఆవిర్భవించి పరమత సంహారం చేస్తవి గాని, వృధాగా పోనేర్చునా? వట్టి మాట!' అన్నాడు. 'ఔర, ఏమి మూర్ఖత; ఏమి అహంభావము, ఈ అజ్ఞులా అవతార పురుషులు? ఇలా అన్నందుకు వీళ్ళ తలలు పగిలిపోవురా?' అని గురువుగారు అన్నారు.

'శాస్త్రులుగారూ! పాత రోజులైతే వీళ్ళే అవతరాలయిపోదురు. వీళ్ళ పేరిట బొమ్మలు నిలిపి, దేవాలయాలు కట్టి, మనవేఁపూజ్జేతుం. మరి బుద్ధుడూ ఇలాంటి మనిషే గదండి' అన్నాడు వెంకయ్య.

'చాకి బట్టికీ సముద్రానికీ సాహిత్యం తెస్తివి' అన్నారు గురువుగారు

'అన్న మాటకల్లా వ్యాఖ్యానం చేస్తేగాని పూస్తుపోదురా?' అని నే అన్నాను.

'ఈ ఊరి నాయలు స్తోమం కలవాళ్ళు. అందులో సారధి నాయుడు లక్షాధికారి. అతని బావమరిది రామినాయుడు గ్రామ మునసబు. కొంచ ధూర్తూ, నిషా బాజీన్నీ. భోజన ప్రియుడు, ఈ తాలూకాలో కల్లా పెద్ద సారా దుకాణం ఈ ఊళ్ళోనే ఉంది. దాన్నిబట్టి ఈ ఊరి యోగ్యత మీరు ఊహించుకోవచ్చును.

నాలుగు సంవత్సరముల కిందట ఇక్కడకి దక్షిణ దేశం నుంచి ఒక అయ్యవార్లంగారు వచ్చి, సారధి నాయుడికీ, ఇంకా మరికొందరు నాయకులకూ, చక్రాంకిత చేసి, వైష్ణవవిఁచ్చారు. ఆనాడు మునసబు రామినాయుడు రామస్వామి వారి ఆలయములో తూంపట్టు పులిహోరా, వైష్ణవమూ ఏక కాలముందే గ్రహించాడు. నాటికీ, నేటికీ, రెంటియందూ ప్రవత్తి ఏకరీతిగానే ఉంది. అప్పటినుంచీ సారధినాయుడు ద్వాదశి ద్వాదశికీ స్వాం వారికి విరివిగా రాగ భోగాలు నడిపిస్తున్నాడు. ద్వాదశి అంటే రామినాయుడికి పెద్ద పండగ.

నాయళ్ళంతా వైష్ణవం పుచ్చుకుని, శివకోవిల వైపు తిరిగి చూడకపోవడం, శరభయ్యకు కంట్లో మిరపకాయలు రాసుకున్నట్లు ఉండెను. ఆలోచించి ఒక ఎత్తు ఎత్తాడు.

ఆ రోజుల్లో హైదరాబాదు రాజ్యం నుండి శివాచార్లు కొందరు దేశ సంచారార్ధం ఈ ప్రాంతానికి వచ్చారు. మరి రెణ్ణెల్లనాటికి పీఠంతోనూ, ప్రభలతోనూ, రుంజలతోనూ, పెను ప్రళయంగా వచ్చి యిక్కడికి దిగబడ్డారు. రోజూ అర్ధరాత్రి వేళ శివార్చన చేసేవారు. ఆ సమయంలో శంఖాలు, జయఘంటలు, ఢమామామీలు, వీటి ధ్వని పామరుల మనస్సులో భయోత్పాతం పుట్టించేది. ఈ నల్లరాతి కొండల్లో ఆ ధ్వనులకు ప్రతిధ్వనులు కలిగి, కోలాహలంగా ఉండేది. ఈ అట్టహాసంతో వైష్ణవం పుచ్చుకున్న ఒక్కొక్క నాయడే, నామాలకి నామం బెట్టి, వీబూది రుద్రాక్షధారణం చెయ్యడం ఆరంభించాడు. వచ్చిన పదో రోజున శివాచార్లు గుండం దొక్కడానికి పెద్ద ప్రయత్నాలు చేశారు. సారథి నాయణ్ణి కదిలించడమే వాళ్ళ ముఖ్యప్రయత్నంగా వుండెను. అదివరకే సారథి నాయడికి శివమతం వేపు తూగు లావాయెను. గుండం తొక్కడం చూసిన తరువాత సారధి నాయుడు సిద్ధాంతంగా శైవం పుచ్చుకుంటాడని అంతా నమ్మారు. అందుచేతనే, శైవుల్లో మొనగాళ్ళంతా రుంజులతో సారధినాయుడి ఇంటికి వెళ్ళి, చాలా కైవారం చేసి ఉత్సవం చూచుటకు రాక తీరదని పిలిచారు.

ఈ మాట చెప్పగా, అయ్యవార్లంగారు ఏవఁన్నారంటే 'రాముడి ఆజ్ఞ ఏలా ఉంటే, అలా జరుగుకాక, వైష్ణవుడు, శైవుడు కావాలని కోరితే, అడ్డియేమి కార్యం? కాక కాశీలో మృతిపొందిన వారికి శివుడే కదా, తారక మంత్రోపదేశం చేస్తాడు. గనుక ఈ జన్మంలో పరమ శైవుడైనవాడికి, వచ్చే జన్మలో తారకమంత్రోపదేశం చేసి, ముక్తి ఇవ్వకపోతాడా? ఏ మతమైనా ప్రవృత్తి ఉన్నవాడికి తోవ ఉంది. అది లేకుంటే వైష్ణవుడైనా, కార్యం లేదు'. సాతాన్లకి అయ్యవార్లంగారి ఉదాసీనత చేయి విరుచుకున్నట్లు ఉండెను.

'ఈ బ్రాహ్మడికి వైష్ణవాభిమానం తక్కువ. గనక మనం విజృంభిస్తేనే గాని వైష్ణమతప్రభావానికి అగౌరవం వస్తుందని మనవాళ్ళయ్య ప్రగల్భించి, శివాచార్లు గుండం దొక్కేనాటి రాత్రి రెండు ఝాములప్పుడు కోవిల ఎదటి రావిచెట్టు కింద పెద్ద మీటింగు చేశాడు. సాతాన్లూ నాయలూ వందలకి జమ అయినారు. అందులో యోధులు దుకాణంలో రహస్య శేవ సేవించి, ఒక్కొక్కరే దిగబడ్డారు. అంతట మనవాళ్ళయ్య చెట్టు మొదటి రచ్చ రాతి మీద వంగి నిలిచి, గెడ్డము కింద వక కఱ్ఱ ఆనుకుని, ఏమని పలికెను. 'పరమ భాగవతోత్తములారా, వింటిరా ఈ శైవుల యొక్క రాక్షస మాయల్లోపడి, అప్పుడే చాలా మంది నాయలు వైకుంఠానికి పోయే రాజమార్గమైన వైష్ణవ మతం విడిచి, అంధకార బంధురమైన శైవమతంలో కూలిపోయినారు. ఇక మన పరమ మిత్రుడున్నూ, భక్తాగ్రేసరుడున్నూ అయిన సారధినాయుణ్ణి మాయగమ్మి తమలో పడవేసుకొనుటకు, ఇప్పుడు విపుల ప్రయత్నం గనక అతన్ని కాపాడి శ్రీ మహావిష్ణువు యొక్క మహిమ ప్రజ్వలింపజేసే సాధనం ఏమిటో తాము అంతా ఆలోచించండి. సారధి నాయుడు ఈ రాత్రి అక్కడకు వెళ్ళకుండా ఉపాయము కల్పించడము కర్తవ్యమని నా అభిప్రాయము.'

ఎలాగంటే, ఎలాగని నలుగురూ తలపోయుచుండగా, రామానుజయ్య లేచి అన్నాడు 'దీనికంత ఆలోచనేలా? ఏమి? వాళ్ళు చేసే పని మనమేల చేయరాదూ? రామభక్తుడైన శివుడికే అంత మహిమ ఉన్నప్పుడు సర్వేశ్వరుడైన ఆ రాముడికి అంతకన్న వెయ్యి రెట్లు మహిమ ఉండకపోయెనా? గనక నా సలహా ఏమిటంటే శ్రీమద్గరుడాళ్వారి అవతారమైన మనవాళ్ళయ్య రాగి ధ్వజం చేత పట్టుకుని నాలాయిరం పఠిస్తూ గుండం తొక్కితే సరి. శైవ వైష్ణవ మతాల తారతమ్యం లోకానికి వ్యక్తం కాగలందులకు, శివాచార్ల గుండం కంటే మరి బారెడు ఆస్తి లావుచేసి ఈ చెట్టుకిందే ఈ క్షణమందు బ్రహ్మాండమైన గుండం తయారు చేస్తాను. ఇందుకు అభ్యంతరం చెప్పే వాణ్ణి వైష్ణవుడని భావించను.'

చీకట్లో ఎవరికీ కానరాలేదు గాని మనవాళ్ళయ్య నోరు వెళ్ళబెట్టాడు. నలుగురూ 'బాగుంది! బాగుంది!' అనేసరికి అతని ప్రాణాలు ఎగిరిపోయినాయి. ఒక్క నిమిషం ఆలోచించి అన్నాడు. 'అన్నలారా! తమ్ముల్లారా! పరమ భాగోత్తముల్లారా! రామానుజయ్య నన్ను ఆక్షేపణ చేస్తున్నాడు. నేను పడవలసిందే! ఈ శరభయ్యే వచ్చి తాను వృషభావతారవఁని నిక్కి నీలుగుతున్నాడు కదా, మనం దెబ్బకి దెబ్బతీద్దాం, అని కేవలం వైష్ణవాభిమానం చేత నేను గరుడ వేషం వేశానే గాని, ఇంత భారమైన శరీరంతో నేను గరుడాళ్వారిని ఎన్నడూ కానేరనే? ఆ మాట నాకు తెలియదా? ప్రాజ్ఞులైన మీకు తెలియదా? రామానుజయ్య అయితే, చలాగ్గా డేగలా ఉన్నాడు గనుక, అవశ్యం అతగాడే గరుడాళ్వారి అవతారం. అతణ్ణే గుండం తొక్కమనండి. నేనుగానీ నిప్పుల్లో కాలుబెట్టానంటే గజం లోతుక్కూరుకుపోయి చస్తాను. రామానుజయ్య తేలిగ్గా ఉన్నాడు. అంటి అంటనట్టు చప చప అడుగేసుకుపోతాడు. అన్నల్లారా! న్యాయం ఆలోచించండీ' అనేటప్పటికీ రామానుజయ్య సన్న సన్నగా జారాడు.

రామినాయుడు జల్దుకొని అన్నాడు. 'రావఁస్వోవిఁకి మయిమం ఉందా లేదా? ఉందా ఈ ఏషాలు మాని తిన్నగా గుండం దొక్కు.' ఆ మాట విని మనవాళ్ళయ్య మొహం జుమాల్మంది. రామానుజయ్యలాగ మందలో జొచ్చి మాయ వౌఁదాఁవంటే, చీమా దోమాకాడు. పది ఇరవై మణుగుల పట్టు. 'హా దైవమా, నేను ఒక్క అరగడియ గరుడాళ్వారానే అయితే, ఎక్కడనైనా ఎగిరి ప్రాణం దాచుకుందును కదా' అని అనుకున్నాడు.

'ఏం, పల్లకుంటావేం?' రామినాయుడు పొడవడం ఆరంభించాడు. 'అల్లాండం బెల్లాండం అని తెల్లారకుండగ వచ్చి, తెగ అరుస్తావు కదా, ఆ ముక్కలన్నీ మావంటోళ్ళని బెదిరించి కూరా నారా లాగడానికేనా అటి మయిమం యేం కాసింతైనా కద్దా?'

మనవాళ్ళయ్య నిట్టూర్పు విడిచి, రామానుజులను స్మరించి ఇట్లా అన్నాడు. 'రామినాయుడన్నా, నువ్వూ నేనూ చిరకాలం నాటి నేస్తులం, నువ్వు గవర్నమెంటు వారి తరఫున మనసబీ అధికారం చాలా కాలవాఁయి చలాయిస్తున్నావు. యుక్తాయుక్తం ఎరిగిన మనిషివి. అవును గాని, వైష్ణవ మతం యొక్క, ఆధిపత్యత అగుపర్చాలంటే, ఆ శరభయ్య చేసే తక్కువ పనా, చేయమంటావు? పృధి వ్యాపస్తేజో

వాయురాకాశాత్ అన్నాడు. విష్ణుభక్తుడైన వాడికి కర్తవ్యం ఉత్తమోత్తం పృధివీ అనగా భూమి మీద  నడవడమేఁ పంచ భూతములలో మరి ఒక భూతం మీద వైష్ణవుడున్న వాడు అడుగువేసి నడవనే కూడదు. అంతకు ఒక వీసం తక్కువ ఆపః అన్నాడు. అనగా నీట్లో ఉరకడం ఒకపాటి కర్తవ్యం కావచ్చు. అధమాధమం అగ్గి తొక్కడం గనక మీరు యావన్మందిన్ని ఇప్పుడే నా వెంట రండి. ఈ నిశీధి సమయంలో శ్రీ మహావిష్ణువు నామస్మరణ చేసి అమాంతంగా సీతా గుండంలో ఉరుకుతాను అప్పట్లో నా మహిమ మీకుతెలియగల్దు,'

రామినాయుడు దగ్గరకి వచ్చి, మనవాళ్ళయ్య చేయిబట్టుకుని గట్టిగా నొక్కుతూ అన్నాడు. 'ఇన్నావా వైష్ణపోడా, మా ఇయ్యంకుడు సారధి నాయుడు జంగపాళ్ళలో కలిసిపోతే దోదసి పులియోరి శక్కర పొంగళం పోతాయి. ఆ మాట నీకూ ఎరిక; నాకూ ఎరిక. నువు సీతమ్మ గుండలో ఆనపకాయ తుంబలాగ తేలి, ఈతలాడితే, నీ మయిమం ఆడొప్పుతాడా. ఎట్టికుట్టె కబుర్లు మానేసి, మావాడు రెండు కళ్ళతో సూస్తుండగా అల్లాండం బెల్లాండం అంటూ అగ్గిదొక్కు!'

'సరే నేస్తం. నీ అభిప్రాయం ఆ ప్రకారం ఉన్నట్లయితే అలాగే కానీయండి. శ్రీ మహావిష్ణువు యొక్క మహిమ నిలబెట్టడానికి అగ్గి తొక్కుతానా, తొక్కి చూస్తానా. ఇప్పుడు చాలా రాత్రయింది. ఇళ్ళకు పోయి పరుందాం. రేపు ఈవేళ్ళప్పుడు ఈ స్థలంలోనే బ్రహ్మాండమైన గుండం వేసి దంద్యహ్యామానమైన ఆ గుండం తొక్కి వైష్ణవ మత ప్రభావం కనపరుస్తాను. అప్పట్లో ఆ గరుడాళ్ళారే నన్ను ఆవహించి, అంత గుండమునూ చెంగున ఒక్క దాటున దాటిస్తారు'

'ఆ పప్పు ఉడకదు. ఈ రాత్రి మా వాడు జంగపాళ్ళలో కలిసిపోతే రేపు నువ్వు దాటేం, దాటకేం, ఆ దాటే దాటేదో, ఈ యాళ ఆళ్ళ గుండంలోనే దాటు. లెండోస్సి ఈ వైష్ణపోణ్ణి మోసుకెళ్ళి గుండం తొక్కిద్దాం' అని రామినాయుడు అనే సరికి నలుగురు నాయలు మనవాళ్ళయ్య రెక్కలు పట్టుకు పచ్చరాతి మీద నుంచి కిందికి దించారు. మీరి వచ్చిందని మనవాళ్ళయ్య  ఒక ఎత్తు పన్నాడు. 'ఆగండి ఆగండి, గుండం తొక్కవలసి వచ్చినప్పుడు అందుక్కావలసిన పరికం అంతా కూర్చుకోవడవాఁ, లేకుంటే కట్టుగుడ్డలతో గుండంలో పడేసి, ఒళ్ళు తెగ్గాలుస్తారా? ఆ శివాచార్లు వీరభద్ర విగ్రహం చేతబట్టి, మంత్రాలు పఠిస్తూ శంఖధ్వనికి వీరావేశం పుట్టి గుండం తొక్కుతారు. అలాగే శ్రీరామస్వాం వారి తాలూకు ఉత్సవ విగ్రహం ఒకటి నా నెత్తిన కొడితేగాని ఎలా చస్తాను? గరుడాళ్వారు అయినా ఎప్పుడూ పెరుమళ్వారిని వీపున మోసుకునే బయలుదేరతారుగాని ఒట్టినే రెక్క కదపరు. మీరెరగరా' - అనేటప్పటికీ, సారధి నాయుడు ' ఆమాట నిజవఁరా ఇగ్గరవిఁస్తాడు, అయ్యవోర్ని తెలుపుకు రండోస్సి' అన్నాడు. నలుగురు నాయలు పక్కనున్న అయవార్లంగారి ఇంటికి వెళ్ళి, పైమీద గుడ్డ అయినా లేకుండా ఆయన్ను మోసుకు వచ్చి రావి చెట్టు కింద రచ్చ రాతి మీద కూర్చోబెట్టారు. ఈ గడబిడ కనిపెట్టి కృష్ణమాచార్లు అటకెక్కి దాక్కున్నాడు.

## 3

అతి వినయమును నటిస్తూ మనవాళ్ళయ్య రంగాచార్యులు గారికి ప్రస్తుతాంశము విన్నవించి, ఉత్సవ విగ్రహమును ఇమ్మని వేడాడు. రంగాచార్యులు గారు అన్నారు: 'ఓరి మూర్ఖుల్లారా! మీకు మతులు శుభ్రంగా పోయినాయిరా? ఈ గుండం తొక్కడమనేది - గర్హ్యమైన తామస వ్యాపారము; వైష్ణవ మత నిషిద్ధము. మన గ్రంధాల్లో ఎక్కడా ఈ ప్రక్రియ లేదు. గుండం తొక్కడానికి ఒక విధీ, మంత్రం ఏడిస్తేనా?'

'శక్కరంతోటి ఒళ్ళల్లా తెగ్గాల్చడానికి మంతరం కద్దా! అట్టే మాటలు శెలవియ్యక, ఆ ఇగ్గరవేఁదో సాతానోడి కియ్యండి' రామినాయుడు అడిగాడు.

'ఛీ పొండి! మూర్ఖుల్లారా! నేను ఇచ్చేది లేదు. ఉత్సవ విగ్రహములు శూద్రులు ముట్టుకోవలసినవి కావు. ముట్టుగుంటే కళ్ళు పేలిపోతాయి' అని రంగాచార్యులుగారు అనేసరికి, మనవాళ్ళయ్య 'బతికానురా దేవుడా!' అనుకుని, సారధినాయుడితో 'చూశావా నేస్తం!

ఆ మాట నిజమే! నేను ఉత్సవ విగ్రహములు ముట్టుకోకూడదు. అందుచేత, ఇప్పుడు కర్తవ్యం ఏమిటంటే, ఆ విగ్రహం పట్టుకుని అయవార్లంగారే గుండం దొక్కవలసి ఉంటుంది. ఆ అధిక్యత అనేది వారికే ఉండవలసినది.'

మునసబు 'ముసలాయన ఇగ్గరాలట్టుకుని గుండం తొక్కేదేటి? సిన్న సోవిఁనిలెగదీసుకెళదాం రండి', అన్నాడు.

'వాడి జోలికి వెళ్ళకండి. మా బాగే; ఉత్సవ విగ్రహాలు పట్టుకుని, నేనే గుండం తొక్కుతాను. మావాడు పట్టణం వెళ్ళాడు. ఊళ్ళో లేడు' అని రంగాచార్యులుగారు అన్నారు.

'అయితో లెండోయ్!' అని మనవాళ్ళయ్య బొబ్బ వేశాడు. అంతట ఆ రావి చెట్టు మాను చాటున గుప్పని ఒక వెలుతురు పుట్టింది. అందరూ భీతిల్లారు. నిషాలు దిగజార జొచ్చాయి. వెంటనే మాను వెనకనుంచి ఒక చేత కరదీపము, రెండవచేత సూరకత్తి కట్టుకుని, ఉంగరాల జుత్తు గాలికి తూగులాడుతుండగా, నిబ్బరంగా అడుగు వేసుకుంటూ వచ్చి నాంచారమ్మ, మామగారి పక్కన నిలిచి, ఆయన రెక్కలు పట్టుకుని ఉన్న నాయల వంక బాకు మొన జూపి 'దుష్టుల్లారా! ఈ పరమ పవిత్రమైన బ్రాహ్మణ్ణి వదుల్తారా. బాకుకు బలి ఇచ్చేదా!' అని అడిగినది.

హఠాత్తుగా వచ్చిన ఈ వీర రూపమును చూచి, అందరి ధైర్యాలూ అడుగుంటాయి. అయ్యంవార్లంగారిని పట్టి నిలిచిన నాయలు బెదిరి దూరం సాగారు. అంతట ఆమె చేతి దీపం రచ్చ రాతి మీద ఉంచి, 'నీకేం కావాల'ని మనవాళ్ళయ్యను అడిగింది. మనవాళ్ళయ్య రెండడుగులు వెనక్కి వేసి, తనకేమి అక్కరలేదన్నాడు.

'నీకు ఉత్సవ మూర్తులు కావలెనంటివి?'

'నాకెందుకు తల్లీ, అపవిత్రుడను! వాటి ఎత్తు బంగారం కరిగి ఇస్తే నాకు అక్కర్లేదు. రామినాయుడు ఏమో కొంచెం –'

ఆమె అటుంచి ఇటు తిరిగి, రామినాయుడిని నిస్సారంగా చూస్తూ – 'నీకేం గావాలి, మునసబు నాయడా' అని అడిగింది.

మొహం ఒంచి, రామినాయుడు తనకేమి అక్కర్లేదని పైకి చెప్పి, 'ఆడదాయితో యవడు మాటాడగల్డు?' అని గొణుక్కున్నాడు. రామినాయుడి పెళ్ళాం గయ్యాలి.

నాంచారమ్మ – 'ఎవరికీ ఏమీ అక్కరలేకుంటే ఈ ముసలి బ్రాహ్మణ్ణి ఒంటిమీద బట్టయినా లేకుండా నిద్దర మంచం మీంచి ఎందుకు ఈడ్చుకు వస్తిరి? ఎవరూ మాట్రాడేవిఁ!'

రామినాయుడు కొంచెం ధైర్యం తెచ్చుకుని ' ఆడదాయితో మాటలకంటే సాల్లేంగాని ఈ రాత్రికాడ ఆ జంగపోళ్ళు శివుఁడు పేరు జెప్పి గుండం దొక్కుతారు గదా, మన రామస్సోంవోరి పేరు జెప్పి మనం కూడా గుండం దొక్కకుంటే, మన పెండెం ఇరిగిపోదా?'

నాంచా: (మనవాళ్ళయ్యతో) 'నువ్వెందుకు తొక్కకూడదూ?'

మనవాళ్ళయ్య: 'అమ్మా. ఈ వేళ ఏదో నా ప్రారబ్ధం చాలక ఈ మీటింగు తలపెట్టాను. బుద్ధి గడ్డి తిన్నది. ఇదిగో లెంపలు పడపడ వాయించుకుంటున్నాను. తల్లీ నన్ను ఈకాడికి వదిలిస్తే శ్రీరంగం వెళ్ళిపోతాను. ఈ నాలుగు ఊళ్ళ పొలిమేరనూ, నేనంటూ తిరిగి కనపడితే, నా నెత్తిమీద పెద్ద పిడుగు పడిపోవాలి.'

నాంచా: 'నీకు కొండంత గుండె ఉంది! (రామినాయుడుతో) మునసబు నాయడా, నీ వియ్యంకుడు సారధి నాయుడు విరిగిపోతే ద్వాదశి ద్వాదశికీ 'శంకర పొంగళం.' 'పులియోరో' లేకపోతాయని గదా దుఃఖం?'

మునసబు: (తలగోక్కుంటూ) 'నా కొక్కడికే అన్నమాటేమిటమ్మా, ఆ రామస్సోం వోరికి మాత్రం పులియోరం కరువైపోదా?'

మనవా: 'అమ్మా, శక్కర పొంగలి, దద్దోజనమూ అనేవి ముఖ్యములు కావు. వైష్ణవమతోత్కర్ష మహిమ కనపర్చి, ఉద్ధరించాలి అదీ కర్తవ్యం.'

నాంచా: ఆ ఉద్ధరించడం ఏదో నువ్వేల చేయరాదు? నీకు ఉత్సవ విగ్రహ మంటూ ఏలా! ఆకాశమంత రాగి ధ్వజం మోసుకు తిరుగుతావు గదా దానిలో అరకాసంతయినా మహత్తు లేదా?‘

మనవాళ్ళయ్య: ‘మళ్ళీ మొదటికొచ్చింద‘ని, సణుక్కుంటూ, కష్టం మీద మందలో దూరి అంతర్థానం అయిపోయినాడు.

నాంచా: ‘రాముడే కాడు, ఏ దేవుడి మీదనయినా నిజమైన నమ్మకమన్నది ఏడిస్తే ఒక్క గండమేకాదు, అని కష్టాలూ తరించవచ్చును. నేను మా మామాగారి పేరు స్మరిస్తూ గుండం తొక్కుతాను. నావెంట రాగలిగిన వైష్ణవులెవరైనా ఉంటే ఎదటికి రండి‘.

ఎవడూ పలకలేదు.

నాంచారమ్మ: నిరసన నవ్వు నవ్వి ‘ముసలాయనను అగ్గిలో తోసి పై నుంచి చూడటానికి మీరంతా వీరులా?‘

ఎవరూ ఉలకలేదు పలకలేదు.

నాంచారమ్మ అందరినీ కలయజూసి ‘పీరు సాయీబు ఇక్కడ లేడా?‘ అని అడిగింది. పీరు సాయీబు వెంటనే ఎదటికి వచ్చి ‘అమ్మా, ఇదిగో దాసుడ‘ని చేయి జోడించి నిలుచున్నాడు. పీరు సాయీబు దూదేకుల సాయీబు అయినప్పటికీ, రామభక్తుడు, కీర్తనలు చెపుతాడు. హటయోగం అభ్యసిస్తాడు. రోడ్డు పక్క ఏటిహొడ్డు తోటలో మఠం ఇతనిదే ఇతనికి శిష్యబలగం లావు.

‘సాయబు! నువ్వు గుండం తొక్కగలవా?‘ అని నాంచరమ్మ అడిగారు.

‘మీ శలవైతే అవలీలగా తొక్కుతాను తల్లీ!‘ అని అన్నాడు.

నాంచారమ్మ: ‘ఏడీ మనవాళ్ళయ్య? గరుడుడి అవతారం అంతర్థానమై పోయింది. రామినాయడా, పరమ భాగవతోత్తములై యుండిన్ని, మీరు ఎవరూ గుండం తొక్క జాలినారు కాదుగదా? అట్టి స్థితిలో ఈ పచ్చి తురకకి గుండం తొక్కడానికి భగవంతుడు సాహస ధైర్యాలు యిచ్చాడు గనుక మీ వైష్ణవ మతం గొప్పా అతగాడి తురక మతం గొప్పా? రామినాయడా, మీ దేవులాటంతా ఈ రాత్రి వైష్ణవులు శైవులకి పరాభవం చెయ్యాలని కదా? అందుకు ఉపాయం చెబుతాను వినండి. మతాలు సాత్వికాలూ, తామసాలూ అని రెండు విధాలు. ఈ రెండు విధాల మనుష్యులూ, శైవుల్లోనూ, వైష్ణవుల్లోనూ కూడా ఉన్నారు. గుండాలు తొక్కడం మొదలైన తామస కృత్యాలు చేసే వాళ్ళని శైవుల్లో శివాచార్లు అంటారు. మన వైష్ణవుల్లో అట్టి కృత్యాలు చేసే తెగ కూడా ఉన్నారు. ఎవరో మీకు తెలుసునా?‘

మనవాళ్ళయ్య గుంపులో మరి వక పక్కనుంచి తన బుర్ర పైకి పెట్టి ‘ఎవళ్ళమ్మా వాళ్ళు‘ అని అత్యాతురతతో అడిగాడు.

మునసబునాయుడు ‘మరెవళ్ళు? సాతానోళ్ళు‘ అనేటప్పటికి, మనవాళ్ళయ్య బుఱ్ఱ మళ్ళీ మందలో మాయమైపోయింది.

నాంచారమ్మ: ‘ఆ వైష్ణవులు ఎవరా? మరెవరు తురకలు? పీరు అనేది ఏమిటనుకున్నారు. శ్రీస్వామివారి తిరునామమే. పట్టణంలో ఎంతో మంది హిందువులే పీర్ల పంజాలు ఉంచి గుండాలు తొక్కుతారు. గనక శ్రీరామ స్వామి వారి నామం తెచ్చి పీరు కట్టి ఇస్తాను. ఆ పీరుపట్టుకు పీరు సాయీబు గుండం తొక్కుతాడు. పీరు సాయీబు యోగ్యత మీరెరిగినదే అతగాడు – కబీరు దాసంత భక్తుడు. గనక భయాలు విడిచే అతని వెంట వెళ్ళి జయించుకుంరండి. వేళకి భక్తి నిలుస్తుందో నిలవదో చేతి కఱ్ఱలు మాత్రం మరవకండి?‘

ఆమె విరమించేసరికి ఫెళ ఫెళమని ఆ మూకలోనుండి మనవాళ్ళయ్య శ్లోక పఠనం ఉపక్రమించి ఇటూ అటూ మనుషులను తోసుకుంటూ ఎదుటికి సాష్టాంగం చేసి ‘అమ్మా, మీరు సాక్షాత్తూ శ్రీమహలక్ష్మి అవతారం. వైష్ణవ మతం నిలబెట్టారు. మతమే అన్నమాట ఏమిటి? మా ప్రాణాలు కూడా నిలబెట్టారు. ఇహ నా విజృంభణం చూడండి‘ అన్నాడు. మనవాళ్ళయ్య పెద్ద హికమద్దారుడు. ఆ రాత్రి వైష్ణవ తంత్రం తరువాయి కథ అంతా అతనే నడిపించాడు.

అంతా చల్లారగానే అటక మీద నుంచి కృష్ణమాచార్యులు దిగాడు. కష్టసాధ్యమును సాధించిన సంతోషముతో, నాంచారమ్మ కరదీపం తిరిగి చేతపూని, ఇంటికి సవిలాసముగా నడిచి పోవుచుండగా పెనిమిటి ఎదురైనప్పుడు ఆమె ప్రేమ పరిహాసములు పెనుగొను

దృష్టితో చూసెను. ఆ దృష్టి తనకు దేవత్వమిచ్చి తన్ను అవతార పురుషుణ్ణి చేసిందని కృష్ణమాచారి మర్నాడు నాతో చెప్పి, ఆ అర్థంతో శ్లోకం రచించాడు. తమ రహస్య శృంగార చేష్టలు మిత్రులతో చెప్పితేగానీ కొందరికి తనివి తీరదు.

ఆ రాత్రి శివాచార్లు గుండం తొక్కడం చూడ్డానికి నేను వెళ్ళి ఉంటిని. తెల్లవారగట్ల నాలుగు గంటలవేళ చిరి చీకటిలో గుండంలో నిప్పులు కణకణలాడుచుండెను. ప్రాతఃకాలపు శీతగాలి సాగింది. ఒక్క పెట్టున గర్భనిర్భేధమయ్యేట్టు శంఖాది వాద్యములు రేగాయి. ఇంగిలీషు చదువుతున నాస్తికాగ్రేసురులకు కూడా ఆ కాలమందు బితుకు కలిగిందని వారే చెప్పుకున్నారు.

పందిటిలో నుంచి వీరగంధాలు పూసుకున్న నలుగురు శివాచార్లు గుండం దగ్గరకు వచ్చి నిలుచున్నారు. ఒకరు నెత్తిమీద భీకరమయిన రాగి ప్రతిమ పెట్టుకున్నాడు. ఎదురుగా నిలిచి మరి వకడు కత్తి ఝుళిపించుచూ వీర వాక్యాలు కొలిపాడు. ఒకడు గుండంలో నెయ్యిపోసి గుమ్మడికాయ తుండలు గుండం లోకి విసిరాడు. వెంటనే శివార్లు గుండం జొచ్చి నడుచుకుపోయినారు. అవతల ఒడ్డు చేరి తిరిగి తొక్కుటకు వారు ఇటు అభిముఖులైఉండగా, 'అల్లా - రామ్' అని కెవ్వుమని ప్రళయమైన కేక ఒకటి వేసి, తక్షణం శివాచార్లు గుండం దిగిన వైపు నుంచి, మూకను చీల్చుకుని ఒక మనుష్య ప్రవాహము గుండము దాటుకుని పోయింది. వారిలో అందరున్నూ ముఖముల మీద ముసుగులు వేసుకున్నారు. ఆ మనుష్య ప్రవాహమునకు అగ్రమందు వెండి పీరు ఒకటి రెండు చేతులా పట్టి ఒక వీరుడు భీమునివలె నడుచుకు పోయినాడు. ఇది అంతా అరనిమిషం పట్టలేదు.

మూక, చకాపికలై చెదిరిపోయినది. కొందరు సాతాన్లకీ, శివాచార్లకీ కూడా యెత్కించిత్ కాళ్ళు కాలాయి. అది భక్తిలోపం కింద కట్టారు. తరువాత శరభయ్యకీ, మనవాళ్ళయ్యకీ రాజీనామా అయినదని అనుకుంటారు. పైకి మట్టుకు దెబ్బలాడుతున్నట్టే ఉంటారు.

అదుగో, మా ఇంటికి ఎదురుగా ఆ రచ్చసావిట్లో నిలిపిన పీరు ఆ పీరే. నాటి నుంచీ, ప్రతి సంవత్సరం ఆ పీరును పండుగ చేస్తారు. ఊరు ఆబాలగోపాలం శైవ వైష్ణవ భేదం లేకుండా పీరు దేవరకు మొక్కులు చెల్లిస్తారు. త్రిశూలాకారం గనక ఆ పీరు శివపీరే అని శరభమయ్య అంటాడు. ఆ వ్యవస్థదో వెంకయ్య పంతులు గారే చెయ్య సమర్థులు.

'శివుడూ విష్ణూ పీర్లే అయినప్పుడు, బుద్ధుడు శివుడు కారాదా?' అని శాయన్న భుక్త కథ పరిసమాప్తి చేశాడు.

మా గురువుగారు ఈ చరిత్రకు చాలా ఆశ్చర్యపడి అన్నారు. 'ఔరా! కలికాలంలో మనుష్యులే కాదు. దేవుళ్ళు కూడా సంకరం అవుతున్నారు.'

'అయినా తప్పేమి? శివుడన్నా, విష్ణన్నా, పీరన్నా, బుద్ధుడన్నా, ఆ పరమాత్మ మట్టుకు ఒక్కడే కదా!' వెంకయ్య ఊరుకుంటాడా, 'అందరు దేవుళ్ళూ ఒక్కరే ఐతే ఆ పీనుగుల్ని అందరినీ ఒక్కచోటే నిలిపి అందరూ కలిసి పూడ్చి తగలెట్టరాదా?' అన్నాడు.

అంత, గురువుగారు 'ఓరిదేవుళ్ళని పీనుగులంటారా? నువ్వు ఒట్టి కిరస్తానువి, ఇంకా కిరస్తానుకైనా దేవుడంటూ ఉన్నాడు? నువ్వు కిరాతుడివి. పీరో, బ్రిటో, దెయ్యమో, దేవరో, ఈ అజ్ఞులకు మూఢ భక్తి అయినా ఉంది. నువ్వు అందరు దేవుళ్ళకీ ఒక పెద్ద నామం బెట్టావు'

'ఒక్క మీకు తప్ప శాస్త్రులుగారూ' అన్నాడు.

'నీ జన్మానికల్లా విలువైన మాట అంటివిరా' అని నేనన్నాను.

✡ ✡ ✡